# ఆదిశేషయ్య

ఆదిశేషయ్యని నాకు ఇరవై సంవత్సరాలుగా తెలుసును. ఆదిశేషయ్య తెలివి తేటలన్నా, విచక్షణన్నా నాకు అమితమయిన గౌరవం. అపూర్వ మేధా సంపత్తికి పర్యాయ పదాలయిన చాణుక్యుడు, తిమ్మరుసు, విదురుడు, శుక్రాచార్యుడు, గ్లాడ్‌స్టన్ కోవలోని వాడు శేషయ్యని నా నమ్మకం. ఈ ఇరవై సంవత్సరాలలో ఆదిశేషయ్య విజ్ఞత చాలాసార్లు పరీక్షకు నిలబడింది. నెగ్గింది. ఉదాహరణకు రోడ్లమీద ఆవకాయ అమ్ముకు తిరిగే వెంకటసుబ్బయ్య అతన్ని నమ్ముకుని లక్షాధికారి కావడం నా జీవిత కాలంలోనే జరిగిన విషయం.

జాన్సన్ పేరు చెప్పగానే బాస్వెల్ గుర్తొచ్చినట్టుగా, కృష్ణదేవరాయలు పేరు చెప్తే తిమ్మరుసు పేరు లటుక్కున స్ఫురించినట్టుగా ఆవకాయ వెంకటసుబ్బయ్య పేరు చెప్పగానే – తక్కున ఆదిశేషయ్య నామధేయం స్ఫురించాల్సిందే – అలా వారిద్దరి జీవితాలు పెనవేసుకుపోయాయి.

"నమ్మి చెడినవారులేరు" అన్న మన బ్రహ్మంగారి తత్వానికి వెంకటసుబ్బయ్య జీవితం సజీవ నిదర్శనం. చెడిన రోజుల్లో వెంకటసుబ్బయ్య ఆదిశేషయ్యను నమ్మాడు – బాగుపడ్డాడు. పది రాళ్ళు వెనకేసుకున్నాడు. పదిళ్ళు కట్టాడు. పదిమంది కొంపలార్పాడని కొందరు గిట్టనివాళ్ళు అంటారు. డబ్బున్న వాళ్ళకి వచ్చే అపకీర్తే యిదనుకోండి. దాని మాటకేం? మరి వెంకటసుబ్బయ్యలో ఈ ప్రయోజకత్వం అంశ ఆదిశేషయ్యదేనని అతను తెలిసిన ప్రతీవారికీ తెలుసు.

20 ఏళ్ళనాడు - అంటే - ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో వెంకటసుబ్బయ్య సంతపేటలోని ఒక మురికి పాకలో ఉండేవాడు. ఆ రోజుల్లో ఆవకాయ జాడీలని నెత్తిన మోసుకొని స్వయంగా రోడ్లవెంబడి తిరిగి అమ్ముకునేవాడు. నల్లగా బొద్దుగా ఉంటాడు. సుబ్బయ్య జుత్తు నలగలేదు. పంచ, ధోవతి తప్ప లాల్చి కూడా ఉండేదికాదు. ఆ రోజుల్లో ముఖంమీదెప్పుడూ చిక్కని చిరునవ్వు కనిపించేది. తన సరుకు ధరని ఆ చిరునవ్వుతోటే పెంచుకుని పోయేవాడు.

"మరి యింత ధరా సుబ్బయ్యా" అని ఎవరేనా అంటే ట్రేడ్‌మార్క్ చిరునవ్వు నవ్వి 'మీరలా అనకండి సార్ .... నేను నలుగుర్ని మోసం చేస్తే మా శేషయ్య ససేమిరా ఊరుకోడు. తూకం వేసినట్లు చివరి అణావరకూ బేరీజు వేసి నిర్ణయించాడు. వాడు చెప్పినట్టే అమ్ముతున్నాను" అనేవాడు.

అక్కడితో ఎవరూ మాట్లాడేవారు కారు. అలాగే మొట్టమొదటిసారిగా - వెంకట సుబ్బయ్య వ్యాపారం మధ్య, చిరునవ్వుల మధ్య ప్రత్యక్షమయ్యాడు ఆదిశేషయ్య. ఆదిశేషయ్య నిజాయితీ, చిత్తశుద్ధీ - ఆవిధంగా అస్మదీయులకు తెలియవచ్చాయి.

దరిమిలాను వెంకటసుబ్బయ్య వ్యాపార స్వరూపం మారిపోయింది. హఠాత్తుగా సుబ్బయ్య ఆవకాయ వ్యాపారం మూసేశాడని తెలిసింది. ఆంధ్రుల ఆహార వ్యావృత్తికి తీరని నష్టం జరిగిందని నేను వాపోయాను. కాని అంతకన్నా మరో ఆశ్చర్యకరమయిన విషయం తెలిసింది. వెంకటసుబ్బయ్య పుస్తకాల వ్యాపారం ప్రారంభించాడట. ఆవకాయకి, ఆంధ్ర సాహిత్యానికీ సంబంధం ఏమిటో అప్పటికీ యిప్పటికీ నాకు అర్థం కాలేదు.

"ఇదేమిటి సుబ్బయ్యా" అంటే చిరునవ్వు నవ్వి "రోజులు మారిపోతున్నాయి సార్. ధరలు మండిపోతున్నాయి. ఆవాలు ధర ఆకాశం అంటుకుంటోంది. అయినా ఆవకాయ అమ్ముతానన్నాను. కాని మా శేషయ్య వద్దన్నాడు. ఆలోచించి ఆలోచించి ఈ వ్యాపారంలోకి దిగమన్నాడు" అన్నాడు.

సరి - యింక ఆదిశేషయ్య చెప్తే తిరుగులేదు. నా ఆశ్చర్యమంతా ఆదిశేషయ్య పేరులో యింకిపోయింది. ఆదిశేషయ్య ఆలోచన పెద్ద ఎబ్జార్బర్. అతని మాట విన్నాక ఇది ఆశ్చర్యకరమయిన విషయంగా ఎవరూ పట్టించుకోలేదు. పుస్తకాల వ్యాపారిగా వెంకటసుబ్బయ్య స్థిరపడిపోయాడు.

ఈ సంఘటనలో - ఆదిశేషయ్య ద్వారా వెంకటసుబ్బయ్య తన కొత్త వ్యాపారానికి ఎంత గుడ్‌విల్ సంపాదించాడో వ్యాపారస్తులకి అర్థమయి ఉంటుంది.

ఆ తర్వాత వెంకటసుబ్బయ్య నెత్తిన వేసుకుని టన్నులకొద్దీ ఆంధ్ర సాహిత్యాన్ని బజారున పడేశాడు - మాట తప్పయితే క్షమించండి. నెత్తిన పెట్టుకుని వీసెల కొద్దీ సాహిత్యాన్ని టోకుగానూ, చిల్లరగానూ అమ్మాడు. యుద్ధం వల్ల నిత్యావసర వస్తువుల ధరలే పెరిగాయి. మరి సాహిత్యం నిత్యావసర వస్తువుకాదు. అందుకని దాని ధర బొత్తిగా పడిపోయింది.

యుద్ధానికి భయపడి చాలామంది వ్యాపారస్తులు విశాఖపట్నం ప్రాంతాల నుంచి పారిపోయినప్పుడు షాపుల్లో చాలా సాహిత్యం చెదబట్టి కుళ్ళిపోయింది. దాన్ని చవకరేటుకి కొని – ఆదిశేషయ్య సలహాని పుస్కరించుకొని (గమనించండి)–తగుమాత్రం లాభాలతో సరసమయిన ధరకి అమ్మాడు వెంకటసుబ్బయ్య. ఆ అయిదారేళ్ళలో నెత్తిమీద పుస్తకాల మోపుతో, కింద వెన్నెలలాంటి చిరునవ్వుని చూడనివారు లేరు. లక్ష్మణ మూర్ఛ, రావణ శపథం, హనుమంతుడి కోపం, స్త్రీల వ్రతకథలు, గొబ్బిపాటలు, కాశీమజిలీలు, వేగుచుక్క గ్రంథమాల పుస్తకాలు ఒకటేమిటి అన్నీ అమ్మాడు.

ఈ వ్యాపారంలో ఎవరికీ అరువు యివ్వలేదు సుబ్బయ్య. ఎవరేనా అరువు పెట్టబోతే చిరునవ్వుతో – "అరువు యివ్వనని మా ఆదిశేషయ్య మీద ఒట్టేసుకున్నాను సార్. వాడు నా ప్రాణం మరి. వాడికిచ్చిన మాటన్నా అంతే" – అని బ్రతిమాలేవాడు.

అక్కడితో ఆ ఖాతాదారుడి హృదయం కరిగి లేని డబ్బుని అప్పయినా చేసి అతనికి సమర్పించుకునేవాడు –

ఆవిధంగా వెంకటసుబ్బయ్య దశ ఎత్తుకుంది. కొన్నాళ్ళకి బజారులో మహాత్మాగాంధీ హెయిర్ కటింగ్ సెలూన్ ఖాళీ చేయించి అక్కడ పుస్తకాల షాపు తెరిచాడు. మహాత్ముడంటే సుబ్బయ్యకి అమితభక్తి – అందుకని తన షాపుకి "మహాత్మా లిటరరీ మార్ట్" అని నామకరణం చేశాడు.

శతకాలు, వ్రతకథలు కాక – క్రమంగా కొత్త దళసరి పుస్తకాలు షాపులో పెట్టాడు. కాలేజీ పుస్తకాలు తెప్పించాడు. స్టేషనరీ వింగ్ తెరిచాడు. గ్రీటింగ్ కార్డులు, యింకు సీసాలు, గమ్ బాటిల్సు, పెన్సిళ్ళు, పేపరు వెయిట్లు, ఫైళ్ళు ఒకటేమిటి? అన్నీ షాపులోకి వచ్చాయి.

గల్లా పెట్టెముందు గంభీరమయిన ఆసనం చేయించుకొని ఖాతాదారుల్ని తన అపూర్వమయిన చిరునవ్వుతో కట్టి పడేసేవాడు వెంకటసుబ్బయ్య.

తర్వాత తర్వాత చాలా యిళ్ళు కొన్నాడు. ఒకటి కట్టించాడు. "నేను వద్దు మొర్రో అని ఏడుస్తూంటే – మా ఆదిశేషయ్య తిట్టాడు సార్. మనిషన్న తర్వాత నిలవనీడ ఉండాలిరా. నీకు కాకపోయినా నీ పిల్లలకయినా ఉండితీరాలి, అందుకని కనీసం ఒక చిన్న గుడిసె అయినా కొనుక్కో అన్నాడు" అని చెప్పేవాడు. కాని సుబ్బయ్య చిన్న గుడిసె కాదు పెద్ద భవంతులే కొన్నాడు.

అచిరకాలంలోనే ఒక ప్రెస్సుని బేరం చేసి మూడోవారానికే ఒక వారపత్రిక నడుపుతున్నట్టు ప్రకటించాడు. ఇదిగో యిక్కడ – నాకు రచయితగా – వెంకటసుబ్బయ్యతో వ్యక్తిగతమయిన పరిచయం ఏర్పడింది.

"మీ కథ లేనిదే నా పత్రిక రావడానికి వీల్లేదని ఆదిశేషయ్య మరీమరీ పట్టుబడుతున్నాడు సార్. వాడి మీట మీద (నాకథమీద కాదు) నాకు ఎక్కువ గురి. మీరు కాదనకూడదు" అని మరీమరీ చెల్లించి, ఒప్పించి కథ తీసుకువెళ్ళేవాడు స్వయంగా వచ్చి.

మరి అందరి దగ్గరా—అందరి రచనల గురించీ అదేమాట చెప్పేవాడు. అందరు రచయితలూ, ఆదిశేషయ్య అభిప్రాయాన్ని, వెంకటసుబ్బయ్య చిరునవ్వునీ కాదనలేక రచనలు యివ్వడం నాకు తెలుసు.

కాని ఆదిశేషయ్య అభిప్రాయం వీసమయినా పొల్లుపోలేదు. వారపత్రికకు పరపతి పెరిగింది. దశ ఎత్తుకుంది. అచిరకాలంలో అది ప్రముఖ పత్రిక అయిపోయింది.

కథలకి డబ్బు చెల్లించడం విషయంలో చాలా స్ట్రిక్టుగా ఉండేవాడు వెంకట సుబ్బయ్య. అది ఆయనే చాలాసార్లు చెప్పేవాడు. "నే డబ్బు చెల్లించే విషయంలో చాలా స్ట్రిక్టుసార్. మాటంటే మాటే – లేకపోతే మా శేషయ్య చంపేస్తాడు" అనేవాడు.

నాకు కనీసం ఆరుకథలకి డబ్బు బాకీ పడిపోయాడు. డబ్బు చెల్లింపు విషయంలో చాలా స్ట్రిక్టుగా ఉన్నాడనడానికి యింతకన్న నిదర్శనం ఏముంది? ఎప్పుడేనా కారులో సుబ్బయ్య అలా వెళ్తున్నప్పుడు గుర్తుచేస్తే – ఒక్కసారి నిర్ఘాంతపోయి – చాలా సిగ్గుపడిపోయి "అరెరే. మీకింకా డబ్బు చేరలేదా? వాటెనాన్సెన్స్! (అది అతని ఊతపదం) 20 రోజుల క్రితం మీ చెక్కుమీద సంతకం చేసేశానే. మా శేషయ్యాని అడుగుతానుండండి – వాడీమధ్య బొత్తిగా అశ్రద్ధ మనిషి అయిపోతున్నాడు చచ" అని విసుక్కొని "జరిగిన ఆలస్యానికి నన్ను క్షమించండి" అని రెండు చేతులూ పట్టుకొని మనమే ఏదో చెయ్యకూడని పని చేశామేమో అని సిగ్గుపడేటట్లు చేసేశాడు.

చెక్కు మీద సంతకం చేశాడనగానే ఆత్రుత పెరిగి – అది వస్తుందని ఆరు రోజులు ఎదురు చూసి చూసి ఆఖరికి విసుగెత్తి ఫోను చేస్తే ఎంతో బాధపడిపోయి "వీడు – వీడికి మతిపోతోందండీ – పెద్ద మనుషులతో వ్యవహారంరా అని చెప్పానా? మరి చెక్కుబుక్కుని డ్రాయరులో పెట్టుకొని ఈ శేషుగాడు బెంగుళూరు బిజినెస్ పనిమీద వెళ్ళాడు. చూడండి 20 రోజులదాకా రాడాయె. ఏమీ అనుకోకండి. వచ్చాక రూఢిగా పంపంచేస్తాను" అనేవాడు.

ఆదిశేషయ్య సౌజన్యాన్ని శీల ప్రవర్తనని తెలిసిన ఎవరు మాత్రం ఏమంటారు? ఆవిధంగా వెంకటసుబ్బయ్యకి కావలసిన వ్యవధికి, వెయ్యవలసిన వాయిదాలకి ఆదిశేషయ్య ఒక అందమయిన ఎక్స్క్యూజ్ అయ్యాడు.

వెంకట సుబ్బయ్య గురించి ఇలా చెప్పాలంటే కోకొల్లలు. ఒకసారి తన కూతురికి సంబంధం చూశాడు. లక్షాధికారుల సంబంధం . పెళ్ళి దాదాపు కుదిరిపోయిందనే నలుగురూ చెప్పుకున్నాడు. ముహూర్తం కూడా నిర్ణయమయిపోయిందని అన్నారు. కాని ఎందుకో చివరి క్షణంలో ఆగిపోయింది. నాకు దిగ్భ్రమ కలిగింది. సుబ్బయ్యని అడిగితే – కాస్త వెన్నెలని ఒలకపోసి – "నాకు చేసుకోవాలనే ఉంది సార్. ఏర్పాట్లు చేసుకున్నాను. కాని మా ఆదిశేషయ్య చివరి క్షణంలో వద్దన్నాడు సార్. వాడి మనస్సు నొప్పించడం యిష్టంలేదు. ఎంతయినా కావలసినవాడు కదా? నన్నేం చెయ్యమంటారు" అన్నాడు. ఆదిశేషయ్య అభిప్రాయం మీద గురి ఉన్న సుబ్బయ్య. ఆ మాటని ఎలా కాదంటారు? అందుకని పెళ్ళి

ఆగిపోయింది. ఆఖరికి మగపెళ్ళివారు కూడా వెంకటసుబ్బయని అర్థం చేసుకున్నారు. ఇలాంటి సందర్భాలలో సాధారణంగా పీకలు తెగిపోయే కక్షలు పెరిగిపోతాయి. కాని అసలు అలాంటి భయాలే పొడసూపలేదు. పైపెచ్చు సుబ్బయ్య, మగపెళ్ళివారు మరింత సన్నిహితులయారు. తరావత మరి ఆరు నెలలకి పెళ్ళి కొడుకు టీబీతో ధాంమని ఎగిరిపోయాడని తెలిసింది – ఇంతకంటే ఆదిశేషయ్య దూరదృష్టికి ఉదాహరణ ఏం చెప్పమంటారు?

ఏమయినా పదిమంది నిందలనుంచి వెంకటసుబ్బయ్యకు గొడుగు అయ్యాడు ఆదిశేషయ్య. ఇప్పటికీ వెంకటసుబ్బయ్య నిత్య జీవితంలో ఆదిశేషయ్య ఒక భాగం. అతనికి చాలా యిరుకయిన సందర్భాల్లో చాలా విషాదకరమైన సన్నివేశాలలో, వ్యాపారంలో, మొహమాటాలు పెరిగేచోట గుడ్‌విల్‌గా, సెంటిమెంట్‌గా, ఎక్స్యూజ్‌గా, షెల్టర్‌గా ఆదిశేషయ్య సహాయపడుతూంటాడు. అతని వల్లే వెంకటసుబ్బయ్య జీవితం మూడు పువ్వులూ ఆరుకాయలుగా సాగిపోతోంది.

ఇంత చెప్పాక ఒక్క విషయం చెప్పకపోతే సుబ్బయ్యకి నేను అన్యాయం చేసినట్టే అవుతుంది. వెంకటసుబ్బయ్య మానసపుత్రుడు ఆదిశేషయ్య. ఈ ప్రపంచంలో కాదు – ఆదిశేషయ్య ఒక శుభముహూర్తాన వెంకటసుబ్బయ్య మనస్సులో పుట్టి, ఇంతింతై వటుడింతై అన్నట్టుగా మనస్సులో పెరిగి విశ్వరూపం దాల్చి సుబ్బయ్య జీవితంలో ఒక భాగమయిపోయాడు ఆదిశేషయ్య. అవును తప్పేముంది? మనకి అతీతమయిన లేదా సాధ్యంకాని ఒక శక్తికి మనం దేవుడనో, రాముడనో, ఏసుక్రీస్తుఅనో, కర్మనో కాకరకాయనో గుర్తుపెట్టుకున్నాం. కాని సుబ్బయ్య వంటి లౌకికుడు, ప్రజ్ఞాశాలి, బ్రతకనేర్చిన మనిషి ఆ తటస్థ స్వభావాత్మకు – నేచురల్ మీడియమ్‌కీ – మరొక గుర్తు పెట్టుకున్నాడు. ఆ గుర్తే ఆదిశేషయ్య.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక 23.10.1970)